

సంయుక్త, మంజులతోపాటు వారి శిష్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జనార్ధనమూర్తి

త్యాగరాయగానసభ వ్యవస్థాపక వేడుకలు

చిక్కడపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభ 58వ వ్యవస్థాపక వేడుకలు సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్సీ మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గానసభ శాస్త్రీయ కళలకు ప్రాధాన్యత ఇస్తోందని యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేయాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాలలో గానసభ ప్రాచుర్యం పొందిందని ఐదున్నర దశాబ్దాలకు పైగా పలు సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక కల్పిస్తూ నిర్వాహకులు గానసభ ప్రతిష్టను కాపాడుతున్నారని అభినందించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ గానసభ 58 ఏళ్ల ప్రయాణంలో ప్రఖ్యాత సంగీత నృత్య నాటక కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. రెండు రోజులపాటు వ్యవస్థాపక వేడుక జరుపుతున్నామని తెలిపారు. గానసభ సంగీత గురువు సంయుక్త శిష్యబృందం రాగరమ్య ఫైన్ ఆర్ట్స్ మంజుల శిష్య బృందం శాస్త్రీయ గాన గోష్ఠి శ్రోతలను ఆకట్టుకుంది.



అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న రాకేష్‌కుమార్

బీఆర్‌ఎస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

చిక్కడపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బలోపేతం కావడానికి ప్రతి నాయకుడి కృషి చాలా అవసరమని ఆ పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం. రాకేష్‌కుమార్ అన్నారు. పార్టీ బలోపేతం కావడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తున్న పార్టీ సీనియర్ నాయకుడు ఎంవీ అశోక్‌కుమార్‌ను సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాకేష్‌కుమార్ సన్మానించారు. రాకేష్‌కుమార్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ విజయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వడ్డపల్లి దినేష్‌రావు, పాశం రవి, జీవై గిరి, వెంకటేష్, సుధాకర్, నరేష్, గౌస్, రాము, క్యాత శ్రీనివాస్, రచ్చ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



రాజేశ్‌ను సకలకళాకిరీటి బిరుదుతో సత్కరిస్తున్న ఆమని, దామోదర్‌గుప్తా

రాజేశ్‌కు సకలకళాకిరీటి బిరుదు

చిక్కడపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్ఆర్ ఫౌండేషన్, ఆదర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు సోమవారం త్యాగరాయగానసభలో ఉదయం నుంచి రాత్రివరకు ఘనంగా నిర్వహించారు. బాలుతోపాటు పలువురు గాయకులకు స్వరనీరాజనం సమర్పిస్తూ గాయనీగాయకులు గీతాలు ఆలపించారు. గాయకుడు, సంగీతదర్శకుడు, శివరంజని కల్చరల్ ఆర్గనైజేషన్ అధినేత రాజేశ్‌కు సకలకళాకిరీటి-2024 బిరుదు ప్రదానంచేసి సన్మానించారు. పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా. నవరసగాయని ఆమని తదితరులు పాల్గొని రాజేశ్‌ను సన్మానించి మాట్లాడుతూ కళాకారులు సమాజానికి చాలా అవసరమని వారిని సరైన గుర్తింపుతో ఉత్సాహపరిస్తే ఇంకా ఎన్నో అద్భుతాలు వారినుంచి పొందవచ్చన్నారు. ఎస్‌బీఐ మాజీ ఏజీఎం త్రినాథరావు, సంఘసేవకులు కె. భాస్కర్, నాదస్వర విద్వాంసులు హుస్సేన్, గాయనీగాయకులు సుభాష్, శిరీష, శ్రీనివాస్‌రావు, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.



కరాటే బెల్ట్‌లు సాధించిన విద్యార్థులతో రాపోలు సుదర్శన్, విఠల్ జోషి, దామోదర్‌నాయక్, తదితరులు

విద్యార్థులకు కరాటే బెల్ట్‌ల ప్రదానం

బర్కత్‌పుర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లలకు చిన్ననాటి నుంచే కరాటేలో శిక్షణ ఇప్పించాలని కర్నాటక సాహిత్య మందిర్ అధ్యక్షుడు విఠల్ జోషి, జపాన్ కరాటే అసోసియేషన్ ప్రతినిధి రాపోలు సుదర్శన్ పిలుపునిచ్చారు. సోమవారం బర్కత్‌పురలోని హెల్త్‌లీగ్ ప్లే గ్రౌండ్‌లో జపాన్ కరాటే అసోసియేషన్, హెల్త్‌లీగ్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్ట్‌ల పోటీలను నిర్వహించారు. విజేతలకు బెల్ట్‌లను ప్రదానం చేశారు. కరాటే బెల్ట్‌లు సాధించిన వారిలో అడ్విక్ మహరాజ్, అనిల్ ఉబ్బి, అనన్య, గజానంద్, అర్జున్, భానుప్రకాష్, శ్రీవెల్లి, అభిరాజ్, రితేష్, ప్రజ్ఞగైక్వాడ్, సుజన్, సుమన్, శ్రావణి, నక్ష, దర్శిల్ కులకర్ణి, వివేక్ తదితర విద్యార్థులు బెల్ట్‌లను సాధించారు. కార్యక్రమంలో హెల్త్‌లీగ్ ప్రధాన కార్యదర్శి శాంతిస్వరూప్ లీలే, కరాటే మాస్టర్ దామోదర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదని కిడ్నాప్

- నిందితులకు రిమాండ్

మదీన, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ ఇప్పిస్తానని తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వడంలేదని ఓ వ్యక్తిని కిడ్నాప్ చేశారు. ఈ సంఘటన చాంద్రాయణ గుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బార్కస్‌కు చెందిన సాబెర్ ప్లాట్ ఇప్పిస్తానని మొగల్‌పురాకు చెందిన సమీర్, హాష్మీ వద్ద రూ.10 లక్షలు తీసుకున్నాడు. ఆరునెలలు గడుస్తున్నా ప్లాట్ ఇప్పించలేదు. డబ్బులు తిరిగి ఇవ్వమని వారు సాబెర్‌ను కోరగా కాలయాపన చేస్తున్నాడు. దీంతో ఇద్దరూ సోమవారం సాబెర్ ఇంటికి వెళ్లి బలవంతంగా కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారు. తన భర్తను కిడ్నాప్ చేశారంటూ సాబెర్ భార్య చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేశారన్న విషయం తెలుసుకున్న సమీర్, హాష్మీ సాబెర్‌ను విడిచిపెట్టారు. పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

హైదర్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. ఏపీ విశాఖ జిల్లా సాలార్ గ్రామానికి చెందిన సారిపల్లి సాయివంశీ(22) ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా రెండు రోజుల క్రితం నగరానికి వచ్చాడు. కేపీహెచ్‌బీలో వెంకటసాయి హాస్టల్‌లో చేరాడు. సోమవారం సాయంత్రం తాను ఉంటున్న రూమ్‌లో ఉరివేసుకున్నాడు. ఆర్థిక సమస్యలు, ఉద్యోగం లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో గృహిణి..

చందానగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. చందానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా శ్రీశైలం మండలానికి చెందిన దినేష్ జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి శేరిలింగంపల్లి పాపిరెడ్డికాలనీలో నివసిస్తూ క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య కె.రాణి గృహిణి. వీరికి ముగ్గురు సంతానం. దినేష్ తరుచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. ఆదివారం రాత్రి భర్తలేని సమయంలో రాణి ఉరివేసుకుంది. గమనించిన పక్కింటి వారు మృతురాలి తమ్ముడికి సమాచారం అందించారు. సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

ముషీరాబాద్ నియోజకవర్గం ఓట్లు ఏవీ కళాశాలలో, అంబర్‌పేట నియోజకవర్గం ఓట్లు రెడ్డి కళాశాలలో లెక్కింపు



ఏవీ కళాశాలలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేసిన అధికారులు



రెడ్డి కళాశాలలో కౌంటింగ్ కేంద్రం

కవాడిగూడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు ఏవీ కళాశాలలో సర్వం సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల కౌంటింగ్ ప్రారంభిస్తారని ముషీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాస్‌లు ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తామన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎం మిషన్‌లను 14 టేబుళ్లపై లెక్కించనున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు మొత్తం 20 రౌండ్లు ఉంటుందని, ప్రతి రౌండ్ ఫలితాలు అర గంటకోసారి విడుదలవుతాయని ఆయన వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను పార్లమెంట్ నియోజకవర్గం ఆర్‌ఓ సమక్షంలో లెక్కిస్తారని ఆయన తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేలా చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తారు.

అంబర్‌పేట నియోజకవర్గంలో...

బర్కత్‌పుర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని అంబర్‌పేట నియోజకవర్గం ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం 8 గంటలకు బర్కత్‌పురలోని ఆర్‌బీవీఆర్ రెడ్డి కళాశాలలో ప్రారంభిస్తారు. కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచారు. అంబర్‌పేట నియోజకవర్గంలో 51. 65 శాతం పోలింగ్ నమోదైంది.

ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆర్‌వో హేమంత్‌కుమార్ పాటిల్, ఏఆర్‌వోలు అపర్ణ, మారుతిదివాకర్, వీరాబాయిలు తెలిపారు. 14 టేబుల్స్ 17 రౌండ్ల కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఒక్కొక్క టేబుల్ వద్ద పోటీ చేసిన అభ్యర్థి, ఒక కౌంటింగ్ ఏజెంట్‌కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. సెల్‌ఫోన్‌లు పూర్తిగా నిషేధం, డీఆర్‌సీ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావాలని పూజలు

గోల్నాక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లోకసభ ఎన్నికల్లో విజయం ఎన్డీఏ కూటమిదేనని ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించిన సందర్భంగా మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపులో కూడా ఫలితాలు స్పష్టం అవుతాయని బీజేపీ సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీలోని శ్రీమైసమ్మ దేవాలయంలో 101 కొబ్బరికాయలను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీ ఓబీసీ మోర్చా జాయింట్ కన్వీనర్ ఎం.అనిల్‌చారి, నాయకులు దిలీప్ శర్మ, అనూప్, వినోద్ పాల్గొన్నారు.



గోల్నాకలోని మైసమ్మదేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్, తదితరులు

కవాడిగూడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లతో గెలుపొంది నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వ హయంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, నేడు ప్రపంచ దేశాలతో పోటీపడుతుందన్నారు.

జీహెచ్‌ఎంసీ స్వీపర్ ఆత్మహత్య

కవాడిగూడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో పనిచేసే స్వీపర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గాంధీనగర్ పీఎస్ పరిధిలో జరిగింది. బన్సీలాల్‌పేట పొట్టి శ్రీరాములునగర్‌లో నివాసం ఉండే ఎల్లేష్ (35), భార్య మల్లిక ఇద్దరు జీహెచ్‌ఎంసీలో స్వీపర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా ఎల్లేష్ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లలేదు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విధులకు వెళ్లి ఇంటికి వచ్చి భార్య తలుపులు మూసి ఉండటంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు తీసి చూడగా భర్త ఎల్లేష్ ఉరేసుకుని కనిపించాడు. వెంటనే గాంధీనగర్ పీఎస్‌కు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఎల్లేష్ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. జీహెచ్‌ఎంసీలో స్వీపర్లుగా విధులు నిర్వహిస్తున్న ఎల్లేష్ మతిస్థిమితం సరిగా లేక, లేదా మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడ అనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

పౌరహక్కుల నేత వెంకటరమణిని వెనక్కి పంపిన పోలీసులు

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కుల నేత వెంకటరమణిని పోలీస్‌లు వెనక్కి పంపించారు. స్వీడన్ పౌరసత్వం కలిగిన వెంకటరమణిపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. వెంకటరమణి వస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆయన్ని శంషాబాద్ విమానాశ్రయంలో అడ్డుకున్నారు. 'వెంకటరమణిపై ప్రభుత్వం నిషేధం ఉంది. ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నిస్తే అడ్డుకున్నాం. విమానాశ్రయం నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు." అని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



బాగ్‌అంబర్‌పేటలో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



ప్రొ. జయశంకర్‌కు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

బర్కత్‌పుర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సారథ్యంలోనే తెలంగాణ అభివృద్ధి సాధించిందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకల సందర్భంగా సోమవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ, బర్కత్‌పుర లింగంపల్లి చౌరస్తాలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగానే నియోజకవర్గంలో దశాబ్ది వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.

చిక్కడపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ముషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం బీఆర్‌ఎస్‌జెండాను యువజన విభాగం రాష్ట్ర నేత ముఠా జైసింహ ఆవిష్కరించారు. పార్శిగుట్ట చౌరస్తాలో జాతీయ జెండా, పార్టీ జెండాలను ఆవిష్కరించారు.

ముషీరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, భోలక్‌పూర్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నేతలు సయ్యద్ ముక్తార్ హుస్సేన్, ముఠా జైసింహ తదితరులు రాంనగర్‌లో పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు.

రాంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం దశాబ్ది ఉత్సవాల మూడవ రోజు ముగింపు వేడకల సందర్భంగా సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గం భారత్ జాగృతి కన్వీనర్ పరకాల మనోజ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ముఠా జైసింహ, భారత్ జాగృతి ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఐటీ ఫోరం అధ్యక్షుడు నవీన్ ఆచారి హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు.

అతిగా నవ్వుతూ..

నవ్వు ఆరోగ్యానికి మేలు చేస్తుందని అంటారు. అలాగే నవ్వు నాలుగు విధాల చేటు చేస్తుందని కూడా అంటారు. కొందరి విషయంలో పరిశీలిస్తే నిజమే అనిపిస్తోంది. ఓ వ్యక్తి విషయంలో ఇలాగే జరిగింది. టీవీలో కామెడీ షో చూసి విరగపడి ఎక్కువ సేపు నవ్వుతూనే అకస్మాత్తుగా అచేతనంగా కిందపడిపోయాడు. అతన్ని పరిశీలించిన వైద్యులు దాన్ని మూర్ఛకు సంబంధించిన.. స్పృహ కోల్పోయిన సమస్యగా నిర్ధారించారు. ఈరకం జబ్బుతో బాధపడే వారు కూడా ఉంటారా.. అని ఆశ్చర్యమనిపిస్తుంది. అవును ఇలాంటి ఓ కేసు అపోలో ఆస్పత్రి న్యూరాలజిస్టు డాక్టర్ సుధీర్‌కుమార్ వద్దకు వచ్చింది. ఆయన ఈ కేసు వివరాలను తన ఎక్స్(ట్విటర్) ఖాతాలో పంచుకున్నారు.

- హైదరాబాద్ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):

- పగలబడి నవ్వుతూ స్పృహ కోల్పోయిన వ్యక్తి
- కాసేపు అచేతనం.. తర్వాత సాధారణ స్థితికి
- అపోలోకి తరలింపు ● ఏమీ కాలేదని తేల్చిన వైద్యులు
- నవ్వు ప్రేరిత సింకోప్‌గా నిర్ధారణ



ఫైల్ ఫొటో

హైదరాబాద్‌కు చెందిన 53 ఏళ్ల ఓ వ్యక్తి విపరీతమైన నవ్వుతో స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రికి తరలించారు. వారం, పది రోజుల క్రితం సదరు వ్యక్తి కుర్చీలో కూర్చుని టీ తాగుతూ తన కుటుంబంతో కలిసి టీవీలో కామెడీ షో చూస్తున్నాడు. ఆ షోలో ఒక అంశం ఆయనకు విపరీతమైన నవ్వును తెప్పించింది. నవ్వును అదుపు చేసుకోలేనంతగా కొన్ని నిమిషాల పాటు పగలబడి ఆగకుండా నవ్వాడు. ఈ క్రమంలో అతను నియంత్రణ కోల్పోయాడు. కొద్దిసేపటి తర్వాత, అతని శరీరం ఒక వైపునకు వంగి, కుర్చీ నుంచి నేలపై పడిపోయి స్పృహ కోల్పోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తున్న సమయంలో కళ్లు తెరిచి, తన శరీరాన్ని కదిలించడంతోపాటు మాట్లాడగలిగాడు. ఈ క్రమంలో అతన్ని జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీ రూమ్‌కి తీసుకొచ్చేసరికి పూర్తిగా కోలుకున్నాడు. పరిశీలించిన వైద్యులు అతనికి ఎలాంటి హానీ జరగలేదని, అనారోగ్యం ఏమీ లేదని నిర్ధారించారు. అతన్ని న్యూరాలజిస్టు డాక్టర్ సుధీర్ కుమార్ పరిశీలించి ఈ పరిస్థితిని నవ్వు ప్రేరిత సింకోప్ (Laughter-induced syncope)గా నిర్ధారించారు. ఇది వాసోవాగల్ మెకానిజమ్స్ వల్ల ఏర్పడే అరుదైన అంశంగా ఆయన గుర్తించారు. ఇది ఒక విధమైన మూర్ఛకు సంబంధిత సమస్య అని, ఎలాంటి మందు లు అవసరం లేదని, ప్రాణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తేల్చారు.

అధికనవ్వుతో రక్తసరఫరా తగ్గే ప్రమాదం..

విపరీతమైన నవ్వుతో ఒక్కోసారి రక్తపోటు వేగంగా తగ్గిపోతుందని, నాడీ వ్యవస్థ నుంచి అధిక ప్రతిస్పందనను ప్రేరేపిస్తుందని డాక్టర్ సుధీర్‌కుమార్ వివరించారు. దీని వల్ల మెదడుకు ప్రవహించే రక్త సరఫరా తాత్కాలికంగా తగ్గుతుందని, ఫలితంగా స్పృహ కోల్పోయే ముప్పు ఉంటుందన్నారు. విపరీతమైన నవ్వు, ఎక్కువసేపు నిలబడటం, అధిక శారీరక శ్రమ వంటి మూర్ఛ సాధారణ ట్రిగ్గర్‌లను నివారించాలని డాక్టర్ సూచించా రు. బీపీ మందులు వినియోగిస్తున్నవారు, గుండె జబ్బులు ఉన్న వారు అతిగా, బిగ్గరగా నవ్వొద్దని ఆయన సూచిస్తున్నారు. ప్రమాదం లేమీ లేకపోయినప్పటికీ రక్త ప్రసరణలో మార్పులు చోటు చేసుకుంటాయని చెప్పారు. 'ఎప్పుడు నవ్వుతూ.. సంతోషంగా ఉండాలని, సంతోషమే సగం బలమని వైద్యులు తరుచూ చెబుతుంటారు. కానీ, దేనిని అతిగా తీసుకోవడం మంచిది కాదని ఈ కేసులో నిరూపితమైంది' అని డాక్టర్ సుధీర్‌కుమార్ వివరించారు.



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిలిచిన వర్షం నీరు

పాఠశాల ప్రాంగణంలో వర్షం నీరు

ముషీరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో చేరిన వర్షం నీరు చెరువును తలపిస్తోంది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వర్షంనీరు భారీగా చేరడంతో రెయిన్‌బో హోం అనాథాశ్రమం బాలికలు, పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు.



విజేతలతో ప్రభుత్వ వ్యాయామ విద్యా పాఠశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి

విద్యార్థులు క్రీడల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందాలి

- ప్రభుత్వ వ్యాయామ విద్యా పాఠశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి

కవాడిగూడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని దోమలగూడ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి పిలుపునిచ్చారు. దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో మూడు రోజులుగా జరిగిన 7వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా, పురుషుల టోర్నమెంట్ 2024-25 ముగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ టోర్నమెంట్‌లో 24 జట్లు మహిళలు, 24 పురుషుల జిల్లా జట్లు పాల్గొనగా పురుషుల విభాగంలో హైదరాబాద్, మహిళల విభాగంలో ఖమ్మం జట్లు ఛాంపియన్‌గా నిలిచాయి. పురుషుల విభాగంలో హైదరాబాద్, మహబూబ్‌నగర్ సంయుక్తంగా, మేడ్చల్, నల్గొండ మహిళల విభాగంలో నిలిచారు. ఖమ్మం, మేడ్చల్ సంయుక్తంగా మహబూబ్‌నగర్, నల్గొండ స్థానాలలో నిలిచారు. కార్యక్రమంలో ఆలిండియా అడ్వయిజరీ బోర్డు ఈఎస్ఐ, రాష్ట్ర నెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు విక్రమాదిత్యారెడ్డి, కార్యదర్శి మహ్మద్ ఖాజా ఖాన్, సభ్యులు రామ్మోహన్‌గౌడ్, కార్యనిర్వాహకులు హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం.బిగ్నేష్, జె.ఎస్. రావు, నెట్‌బాల్ క్లబ్ సభ్యులు, మిత్ర స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

రాంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆవోపా బ్యాంక్ చాప్టర్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఈఏపీ సెట్, నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్ - 2024 ఫలితాల్లో తొలి వెయ్యి ర్యాంకులు సాధించిన వారిలో 100 మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్యవైశ్య విద్యార్థులను స్వర్ణ పతకాలతో సత్కరించనున్నట్లు చాప్టర్ సంస్థ అధ్యక్షుడు పీ. వీ. రమణ తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధి సంపత్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. అర్హులైన వారు దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్//ఫామ్స్‌జీఎల్ఈ/4డీరాజ్‌టీ2ఎల్70క్యూఆర్8వీఎన్‌జేబీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 20వ తేదీలోపు వాటిని పీ.వీ. రమణయ్య, ఫ్లాట్ నంబర్ 3-81/202, విజేత విహార్ అపార్ట్‌మెంట్, చైతన్యపురి, హైదరాబాద్ చిరునామాకు పంపించాలని, ఇతర వివరాలకు 9441928528 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా, తదితరులు

గొర్రెల పంపిణీ పథకం అవినీతిపై విచారణ జరిపించాలి

రాంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అవకతవకలు జరిగాయని, ఈ అవినీతిని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి కేసులు నమోదు చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా డిమాండ్ చేశారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు విచారణ వేగవంతం చేసి రూ.700 కోట్ల అవినీతి జరిగినట్లు తేల్చాలన్నారు. ఈ కేసులో పశుసంవర్ధక శాఖ మాజీ ఎండీతో పాటు అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి ఓఎస్‌డీ కల్యాణ్‌కుమార్ ఇతర కీలక నిందితులను అరెస్ట్ చేశారన్నారు. ఈ కేసులో అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కూడా అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. వెంటనే విచారణ జరిపి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రమేయం ఉందో లేదో వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. కేసులో దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టరాదని, పూర్తి దర్యాప్తు చేయాలని, అవసరమైతే ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్. ప్రకాష్, భాను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జైలుకు పంపారనే కోపంతో

మామ, బావమరిదిపై కత్తితో దాడి

రాజేంద్రనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తనపై కేసు పెట్టి జైలుకు పంపారనే కోపంతో ఓ వ్యక్తి మామ, బావమరిదిపై మటన్ కొట్టే కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. ఎంఎం పహాడీకి చెందిన సలీంఖాన్ కుమార్తె ఫర్హానాను 21 సంవత్సరాల క్రితం సంతోష్‌నగర్‌కు చెందిన అబ్దుల్లా అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. అబ్దుల్లా, ఫర్హానా మధ్య గొడవల కారణంగా 2018లో మామ సలీంఖాన్ అల్లుడు అబ్దుల్లాపై కేసు పెట్టడంతో జైలుపాలయ్యాడు. జైలు నుంచి వచ్చాక అబ్దుల్లా భార్యతో కలిసి ఉంటున్నాడు.తనను జైలుకు పంపాడనే కోపంతో ఉన్న అబ్దుల్లా ఆదివారం రాత్రి మటన్ కొట్టే కత్తితో మామ సలీంఖాన్(62), బావ మరిది మాజిద్ ఖాన్(24) పై దాడి చేశాడు. స్థానికులు అబ్దుల్లాకు దేహశుద్ధి చేసి అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హారన్ కొట్టాడని..

మదీన, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దారి ఇవ్వమని హారన్ కొట్టినందుకు కోపంతో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన చాంద్రాయణ గుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. అమాన్‌నగర్‌కు చెందిన సల్మాన్(22) సోమవారం సాయంత్రం స్కూటర్‌పై వెళ్తున్నాడు. బార్కస్ పీలీ దర్గా ప్రాంతంలో కారులో అదే రూట్‌లో వెళ్తున్న ఇస్మాయిల్ దారి ఇవ్వమని హారన్ మోగించాడు. దీంతో సల్మాన్ ఇస్మాయిల్‌తో గొడవపడ్డాడు. కోపోద్రిక్తుడైన సల్మాన్ స్కూటర్ డిక్కీలో ఉన్న కత్తి తీసి ఇస్మాయిల్‌పై దాడి చేశాడు. అడ్డుకోగా ఇస్మాయిల్ చేతికి గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సల్మాన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

చాంద్రాయణగుట్ట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందాడు. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిపురా మేకల మండి ప్రాంతంలో వేణుగోపాల్ అనేవ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. పిల్లర్ గుంతలో నీటిని తొలగించడానికి సోమవారం ఉదయం లాల్‌దర్వాజ మోడ్ వద్ద లేబర్ అడ్డా నుంచి పట్టేపల్లికి చెందిన షేక్ సాజిద్(31)ను తీసుకెళ్లాడు. మోటార్‌తో తోడుతుండగా విద్యుత్‌షాక్ తగలడంతో పిల్లర్ గుంతలో పడిపోయాడు. స్థానికులు సాజిద్‌ను ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. ఛత్రినాక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఇంటి యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.